పల్లెల్లో 'ప్రత్యేక' ముద్ర!

- అభివృద్ధి బాటలో గ్రామాలు
- ముగిసిన సర్పంచుల పదవీ కాలం

కెరమెరి: గ్రామ సర్పంచుల ఐదేళ్ల పదవీకాలం గురువారంతో ముగిసింది. వీరంతా గ్రామాభివృద్ధికి ఎనలేని సేవలు చేశారు. తమదైన ప్రత్యేక ముద్రవేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో పనులు చేపట్టారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించడంతోపాటు ప్రజల మౌలిక వసతులు తీర్చడంలో కృషి చేశారు. మండలంలోని 31 గ్రామ పంచాయతీలు ఉండగా 156 గ్రామాలు ఉన్నాయి. 23487 ఓటర్లు ఉండగా, 34 వేల జనాభా ఉంది.

అభివృద్ధి కార్యక్రమాలు

గడిచిన పదేళ్లలో గ్రామ పంచాయతీల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. పల్లె ప్రగతిలో భాగంగా అన్ని పంచాయతీల్లో కంపోస్ట్ షెడ్లు నిర్మించారు. ఈ చెత్తతో కొన్నిచోట్ల సేంద్రియ ఎరువులు తయారు చేశారు. చెత్త సేకరణకు ట్రాక్టర్, మొక్కలకు నీరు పట్టడానికి ట్యాంకర్లను ప్రతీ పంచాయతీ కొనుగోలు చేసింది. అంతిమ సంస్కారాలకు ఇబ్బంది లేకుండా ఉపాధిహామీ పథకంలో ప్రతీ జీపీకి వైకుంఠధామాలు నిర్మించారు. సర్పంచులు పల్లె నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రజలు, రైతులకు అనుగుణంగా మొక్కలు పెంచుతున్నారు. హరితహారంలో భాగంగా ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేశారు. గ్రామాల్లోని రోడ్లకు ఇరువైపులా అవెన్యూ ప్లాంటేషన్ వేశారు. పల్లెకో నడకకు..సేద తీరడానికి ప్రత్యేక ప్రదేశాలు ఉండేవి కావు. దీంతో ఆహ్లాదం నిమిత్తం ప్రతి పంచాయతీ పల్లె ప్రకృతివనాలు ఏర్పాటు చేశారు. అలాగే మండలంలో రెండు మెగాపార్కులు ఏర్పాటు చేశారు. నడక కోసం ట్రాక్‌లు కూర్చోడానికి బెంచీలు వేయించారు. ఔషధ, పూల మొక్కలు పెంచారు.



మోడి గ్రామ పంచాయతీ కార్యాలయం

అవార్డు ఆనందాన్నిచ్చింది



ఝరి ఉత్తమ గ్రామ పంచాయతీగా అవార్డు అందుకోవడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. పారిశుధ్యంతో పాటు ఇతర కార్యక్రమాలు చేపట్టడంతోనే అవార్డు దక్కింది. అదే స్ఫూర్తితో పనిచేశా. – కుమురం న్యానేశ్వర్, తాజామాజీ సర్పంచ్, ఝరి

చైల్డ్‌ఫ్రెండ్లీ పంచాయతీ అవార్డు



2022లో చైల్డ్ ఫ్రెండ్లీ పంచాయతీకేటగిరిలో సావర్‌ఖెడాకు అవార్డు దక్కింది. పారిశుధ్యంతోపాటు పంచాయతీల్లో బడి బయట పిల్లలు లేకపోవడం, బాల్య వివాహాలు నిరోధించడం, మద్యపాన నిషేధంలో అవార్డు అందుకున్నాం.– తుల్సిరాం, తాజామాజీ సర్పంచ్, సావర్‌ఖెడా

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీచైర్మన్ కృష్ణారావు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం కందుల కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీచైర్మన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ప్రారంభించారు. నాఫెడ్ తరఫున మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కందుల కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీపీ శంకర్, బీజేపీ నాయకులు శ్రీనివాస్, విశ్వేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూముల కబ్జాపై ఆందోళన

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని సర్‌సిల్క్‌ఎఫ్ కాలనీలోని సర్‌సిల్క్ భూముల కబ్జాలపై కాలనీవాసులు గురువారం ఆందోళన చేపట్టారు. గత నాలుగు నెలల క్రితం ఒక వ్యక్తి కబ్జా చేసుకుని భవనం నిర్మించుకోగా, మరో వ్యక్తి ఆ స్థలం పక్కనే పొక్లెయినర్‌తో చదును చేయించి పునాదులు తవ్వారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు ఆ పనులను అడ్డుకున్నారు. అనంతరం సర్‌సిల్క్ భూములు కాపాడాలని ఎమ్మెల్యే హరీశ్‌బాబును కలిసి వివరించారు.

ఎలక్ట్రీషియన్లు, టెక్నీషియన్లను గుర్తించాలి

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని ఎలక్ట్రీషియన్లు, టెక్నీషియన్లను రాష్ట్రప్రభుత్వం గుర్తించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు లోకేశ్ కోరారు. జిల్లాకేంద్రంలో గురువారం నిర్వహించిన తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ టెక్నీషియన్ ఫెడరేషన్ మండల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం కష్టపడుతూ జీవనాన్ని సాగిస్తున్న ఎలక్ట్రీషియన్, టెక్నీషియన్లు ఆర్థికంగా ఎదిగేందుకు నిర్ణయాలు ప్రకటించాలని కోరారు. యూనియన్ ప్రతినిధులు అబ్దుల్లా, గంగన్న, కాలు, రమేశ్, సంతోష్, సురేశ్, సాయి, ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్‌ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

బెజ్జూర్: సిర్పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. గురువారం ఆయన మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. కుకుడ వాగుపై రూ.2.50 కోట్ల నిధులతో చెక్‌డ్యాం పనులకు భూమిపూజ చేశారు. అనంతరం కుష్ణపల్లి వాగుపై రూ.2.70 కోట్ల నిధులతో చేపట్టనున్న మరో చెక్‌డ్యాం పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఎల్కపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చెక్‌డ్యాంల నిర్మాణాలతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. మండలంలో మొత్తం ఐదు చెక్‌డ్యాంలు మంజూరు కాగా, రెండింటి పనులు ప్రారంభించామన్నారు. కుకుడ, కుష్ణపల్లి చెక్‌డ్యాంల ద్వారా వంద ఎకరాల చొప్పున పంటలు సాగయ్యే అవకాశం ఉందని తెలిపారు. కుష్ణపల్లి నుంచి గూడెం వరకు రోడ్డు కోసం అటవీ అనుమతుల మంజూరుకు కృషిచేస్తానన్నారు. బెజ్జూర్ శివారులోని సర్వే నం.761, 762లలో సుమారు 300 ఎకరాల్లో సాగు చేస్తున్న ఎల్కపల్లి, సిద్దాపూర్ గ్రామాలకు చెందిన రైతుల సమస్యలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఎల్కపల్లిలో సీసీ రోడ్లు, మురుగుకాల్వలు, అంగన్‌వాడీ భవన నిర్మాణాల కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం పలు గ్రామాలకు చెందిన పార్టీల నాయకులు బీజేపీలో చేరగా, వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పారు. ఆ తర్వాత చిన్నసిద్దపూర్‌లోని హనుమాన్ ఆలయంలో బోర్‌వెల్‌కు భూమిపూజ చేశారు. పాల్వాయి పురుషోత్తం రావు స్మారక క్రీడల్లో మొదటి బహుమతి పోలీస్ జట్టుకు, రెండవ బహుమతి కమీటీ టీంకు అందజేశారు. జెడ్పీటీసీ పుష్పలత, ఎంపీటీసీలు సాయి, పర్వీన్ సుల్తాన, మాజీ ఎంపీపీలు మనోహర్ గౌడ్, శంకర్, ఈఈ ప్రభాకర్, డీఈ భద్రయ్య, ఏఈ ఆయజ్, మండల అధ్యక్షుడు ఉమ్మెరా బాలకృష్ణ, బీజేపీ నాయకులు భాస్కర్ రాజు, శ్రావణ్ రావు, రాజారాం, రాకేశ్, లింగయ్య, సంతోష్, కృష్ణ, రమేశ్, శ్రీను, ఎస్సై విక్రమ్, రామయ్య, రాజేష్ పాల్గొన్నారు.



చిన్నసిద్దాపూర్‌లో ఆంజనేయస్వామి ఆలయంలో చేతిపంపు కోసం భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

బాధిత కుటుంబానికి పరామర్శ

బెజ్జూర్: మండల కేంద్రానికి చెందిన సామల పోచయ్య ఇటీవల మృతిచెందారు. విషయం తెలుసుకున్న సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. గురువారం వారి నివాసానికి చేరుకొని ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు ఉన్నారు.

సీనియర్ సిటిజన్స్ డైరీ ఆవిష్కరణ

కాగజ్‌నగర్‌రూరల్: సీనియర్ సిటిజన్స్‌కు తనవంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హరీశ్‌బాబు అన్నారు. గురువారం ఆయన నివాసంలో సీనియర్ సిటిజన్స్–2024 డైరీని ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లవేళలా అందుబాటులో సమస్యలను పరిష్కరిస్తానన్నారు. వయోధికుల వసతీగృహాల స్థల సేకరణకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ పాల్గొన్నారు.

వేధింపులకు గురిచేస్తే చర్యలు

సీనియర్ సిటిజన్స్‌ను వేధింపులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ హెచ్చరించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ డైరీని ఆవిష్కరించారు.

కూరగాయల సాగు.. లాభాలు బాగు

- తక్కువ విస్తీర్ణంలో పంటలు
- సీజనల్ వారీగా తోటల పెంపకం
- ఆదర్శంగా నిలుస్తున్న గంగాపూర్, కొండపల్లి, నేర్పల్లి రైతులు

రెబ్బెన: బతుకు బండిని లాగటానికి ఉపాధి కోసం పట్టణాలపై వైపు చూడరు.. స్వయం ఉపాధి కావాలంటూ అధికారుల చుట్టూ తిరగరు. సొంత ఊరిపై ఉన్న మమకారంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి పని చేసేందుకు ఆ గ్రామాల్లోని రైతులెవ్వరూ పెద్దగా ఆసక్తి చూపరు. పుట్టిన ఊరిలోనే తమకు తెలిసిన వ్యవసాయాన్నే చేస్తూ ఉపాధిలో ముందడుగు వేస్తున్నారు. ఇతర పంటల సాగుతో పోల్చితే కూరగాయల సాగుతో లాభాలు సాధించవచ్చని గంగాపూర్, కొండపల్లి, నేర్పల్లి రైతులు నిరూపిస్తున్నారు. తక్కువ విస్తీర్ణంలో కూరగాయలు పండిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కొందరు రైతులు స్థానిక మార్కెట్‌లో, మరికొందరు ఇతర ప్రాంతాల్లోని మార్కెట్లలో విక్రయిస్తున్నారు.

వాగు నీటిపైనే ఆధారం

మండలంలోని గంగాపూర్, కొండపల్లి, నేర్పల్లి ప్రాంతాల్లోని రైతులు కూరగాయలు సాగు చేసేందుకు అందుబాటులో ఉండే వాగుల పైనే ఆధారపడుతున్నారు. గంగాపూర్ గ్రామానికి అనుకునే గంగాపూర్‌వాగు, కొండపల్లి, నేర్పల్లి ప్రాంతాల్లో ప్రవహించే కొండపల్లి వాగులే ఆయా గ్రామాల రైతులు కూరగాయలను సేద్యం చేసేందుకు ప్రధాన నీటి వనరుగా ఉపయోగించుకుంటున్నారు. గ్రామానికి అనుకునే వాగులు ప్రవహిస్తుండటంతో రైతులకు సాగునీటి సమస్య పెద్దగా లేదు. వాగుకు అనుకుని ఉన్న భూముల రైతులు వాగు నుంచి మోటార్ల ద్వారా నీటిని తమ పంటలకు మళ్లీ కూరగాయాలు సాగు చేస్తున్నారు. కొంత అతికొద్ది మంది రైతులు మాత్రం బోర్లు, పాతకాలం నాటి బావులు ఉపయోగించి పంటలను కూరగాయాలను పండిస్తున్నారు.



గంగాపూర్‌లో సాగవుతున్న క్యాలీఫ్లవర్ తోట

సీజనల్ వారీగా పంటల సాగు

ప్రణాళికా బద్ధంగా సీజనల్ వారీగా కూరగాయలు ఎలా పండించాలో ఈ గ్రామాల రైతులకు వెన్నతో పెట్టిన విద్య. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కూరగాయాలు సాగు చేస్తుంటారు. ముఖ్యంగా మిర్చి, టమాట, క్యాబేజీ, చిక్కుడు, వంకాయ, బెండ, క్యాలీఫ్లవర్, ముల్లంగి వంటి కురగాయలు సాగు చేస్తున్నారు. ఇక తీగజాతుల్లో బీర, కాకర, సోర, పొట్ల, బుడమకాయలు సాగు చేస్తారు. వీటికి తోడు పాలకూర, తోటకూర, గొంగూర, మెంతి, కొత్తిమీర, పుదీనా, చుక్కకూర, బచ్చలికూర, కరివేపాకు పండిస్తారు. ఇంచుమించు అన్ని సీజనల్‌లో కురగాయల సాగు కొనసాగించటం ఇక్కడి రైతుల ప్రత్యేకత. దీనికి తోడు రసాయనిక ఎరువులు వాడకం తక్కువగా ఉండటంతోపాటు కూరగాయలు తాజా ఉండటంతో వీరు పండించే కూరగాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుంది. పంటలు పండించిన రైతులే నేరుగా మార్కెట్‌లో విక్రయించడంతో లాభాలు అధికంగా వస్తున్నాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామం నుంచి రైతులు తమ కూరగాయలను జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, మంచిర్యాల జిల్లాలోని తాండూర్, బెల్లంపల్లి, మంద్రమర్రి, మంచిర్యాల పెద్దపెల్లి జిల్లా పరిధిలోని గోదావరిఖని, పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలోని చంద్రపూర్ వరకు సప్లయి చేస్తూ లాభాలు సాధిస్తున్నారు. ఇతర పంటల సాగుతో పోల్చితే కూరగాయల సాగులో లాభాలు అధికంగా ఉన్నాయని రైతులు అంటున్నారు. దానికితోడు పాటు సంవత్సరం పొడవునా చేతిలో డబ్బులు కనిపిస్తాయని చెబుతున్నారు.

కెరమెరి ప్రత్యేకాధికారులు వీరే..

కెరమెరి: మండలంలోని 31 పంచాయతీలకు ప్రత్యేకాధికారులను కేటాయించారు. మహేందర్, ఎంపీడీవో(పరంధోళి, కెలిబి, కొఠారి) శ్రీనివాస్, ఏపీడీ సెర్ప్(కెరమెరి), మునావర్ షరీఫ్ తహసీల్దార్ (సుర్దాపూర్, రింగన్‌ఘాట్, సావర్‌ఖెడా), సంతోష్ కుమార్, డీటీ(బాబేఝరి, బోరిలాల్‌గూడ, కరంజివాడ), గోపికాంత్, ఏవో(సాకడ, సాంగ్వి, ఖైరీ), విశ్వేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ(ఆగర్‌వాడ, గోండ్‌గూడ, ఇందాపూర్), సంతోష్‌కుమార్, ఏఈ మిషన్ భగీరథ (అంతాపూర్, భోలాపటార్, మహరాజ్‌గూడ), ఆడే ప్రకాశ్, ఎంఎస్‌వో(గోయగాం, ధనోరా, పార్డ), చంద్రశేఖర్, పీజీహెచ్‌ఎం కెరమెరి(కెస్లాగూడ, మెట్టపిప్రి), స్వర్ణలత, పీజీహెచ్‌ఎం, మోడి(మోడి, ఝరి), జాదవ్ బలిరాం, ఎచ్‌ఎం అనార్‌పల్లి(దేవాపూర్, తుమ్మగూడ, అనార్‌పల్లి), ఆర్.మహేందర్, ఎంపీవో (నిషాని) కేటాయించారు.

కౌటాల మండలంలో..

కౌటాల: మండలంలోని 20 పంచాయతీలకు ప్రత్యేకాధికారులను గురువారం కేటాయించారు. డీఆర్‌డీవో ఎం.సురేందర్‌ను మండల ప్రత్యేకాధికారిగా నియమించారు. కౌటాల ఎంపీడీవో నస్రుల్లాఖాన్ (కనికి, ముత్తంపేట్, శీర్షా) , డిప్యూటీ తహసీల్దార్ బి.రవీందర్(గుండాయిపేట్, తాటిపల్లి, తుమ్మిడిహెట్టి, వీర్దండి), ఎంఈవో డి.సోమయ్య (పార్డీ,సాండ్‌గాం, వీరవెల్లి), ఎంపీవో కె.మౌనిక (బాలేపల్లి, తలోడి, నాగేపల్లి, గుడ్లబోరి)లకు ప్రత్యేకాధికారిగా నియమించారు. తహసీల్దార్ కె.శ్రీపాల్ రెడ్డికి గుడ్లబోరి, మొగడ్‌దగడ్, తాటినగర్ పంచాయతీలు.. ఏవో పి.రాజేశ్‌కు బోదంపల్లి, గురుడుపేట్, కన్నెపల్లి పంచాయతీలను అప్పగించారు.

అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం



రెబ్బెన: సర్పంచులను సన్మానిస్తున్న ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర ఎంతో కీలకమని ఎంపీపీ సౌందర్య, జెడ్పీటీసీ సంతోష్ అన్నారు. సర్పంచుల పదవీకాలం గురువారం ముగియడంతో మండలంలోని అన్ని పంచాయతీల సర్పంచులను ఎంపీడీవో కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల పాటు గ్రామాల అభివృద్ధి కోసం అహర్నిశలు పనిచేశారని అన్నారు. కరోనా ప్రభావంతో ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినప్పటికి సొంత ఖర్చులతో గ్రామాల్లో పాలన కొనసాగించారన్నారు. ఇప్పటికి ఎంతో మంది సర్పంచులకు ప్రభుత్వం నుంచి లక్షల రూపాయల బిల్లులు రావల్సి ఉందన్నారు. తహసీల్దార్ సమీర్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రంగు మహేశ్, కోఆప్షన్ సభ్యుడు జహురొద్దీన్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: గ్రామ అభివృద్ధి కోసం సర్పంచ్, వార్డు సభ్యులు కృషి చేశారని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. మండలంలోని ఈదులవాడ పంచాయతీలో సర్పంచ్, వార్డుసభ్యులు పదవీ ముగిసిన సందర్భంగా వారిని గురువారం సన్మానించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కోసం పాటుపడినట్లు తెలిపారు. సర్పంచ్ భీమేశ్, ఉప సర్పంచ్ మహేశ్, వార్డుసభ్యులు పాల్గొన్నారు.



కెరమెరి: సర్పంచ్‌ను సన్మానిస్తున్న గ్రామపెద్దలు



ఆసిఫాబాద్‌రూరల్: సన్మానిస్తున్న ఎంపీపీ మల్లికార్జున్

కెరమెరి: మండంలోని ఖైరి గ్రామ సర్పంచ్ విజయలక్ష్మిని గ్రామస్తులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఎస్‌ఎంసీ చైర్మన్ శివరాం మండాడే, వైస్ చైర్మన్ మహాదేవ్, హెచ్‌ఎం మోగేశ్, టీచర్ స్రవంతి, కార్యదర్శి స్వాతి, గ్రామపెద్దలు పోచయ్య, భీమయ్య, పాలక్‌రావు, దయాకర్, ప్రఫుల్‌కుమార్ ఉన్నారు.

పాత విద్యుత్ స్తంభాలు తొలగించాలి

రెబ్బెన: నంబాల పంచాయతీ పరిధిలోని జెడ్పీ రోడ్డు వెంట ఉన్న పాత విద్యుత్ స్తంభాలు వెంటనే తొలగించి కొత్తవి ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ కొవ్వూరి శ్రీనివాస్ కోరారు. గురువారం రెబ్బెన ఏఈ ఇమ్రాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్తంభాలు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకోవడంతో ఏ క్షణాన విరిగిపడుతాయో తెలియని పరిస్థితి ఉందన్నారు. అధికారులు స్పందించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఏఈ ఇమ్రాన్‌కు వినతిపత్రం అందిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీనివాస్

నిజాయతీ చాటిన విద్యార్థులు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని నజ్రూల్‌నగర్ బ్యాంకు దగ్గరలోని గణేశ్‌మందిర్ ముందు గురువారం నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.1కి చెందిన ఓ మహిళ ఎస్బీఐ పాస్‌బుక్‌తోపాటు విలువైన డాక్యుమెంట్లను పోగొట్టుకుంది. అయితే ఈ డాక్యుమెంట్లు నజ్రూల్‌నగర్ విలేజ్ నెం.5 గ్రామానికి చెందిన తేజస్‌దాస్, సాగర్‌మిస్త్రీలకు దొరికాయి. దీంతో వారు ఈజ్‌గాం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అప్పగించారు. వీటిని మహిళకు ఎస్సై రామన్‌కుమార్ అప్పగించారు. నిజాయతీ చాటిన విద్యార్థులను పలువురు అభినందించారు.



ఎస్సై రామన్‌కుమార్‌కు డాక్యుమెంట్లను అప్పగిస్తున్న విద్యార్థులు

క్లుప్తంగా

జీఎంను కలిసిన ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు



జీఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియా కోల్ మైన్స్ ఆఫీషర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా కార్యవర్గ సభ్యులు గురువారం గోలేటిలోని జీఎం కార్యాలయంలో ఏరియా జీఎం రవిప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎంకు పుష్పగుచ్ఛం అందించారు. జీఎం నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఏరియాలో పని చేస్తున్న అధికారుల సమస్యల పరిష్కారానికి కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ కృషి చేయాలని కోరారు. అధ్యక్షుడు టి.మధుసూదన్, కార్యదర్శి వీరన్న, ఉపాధ్యక్షుడు రమేశ్, ఉజ్వల్‌కుమార బెహెరా, సంయుక్త కార్యదర్శులు నరేశ్, ఎండీ దావూద్ అహ్మద్, కోశాధికారి రామారావు, సంయుక్త కోశాధికారి శంకర్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

చింతలమానెపల్లి: యువత క్రీడల్లో రాణించాలని ఎంపీపీ డుబ్బుల నానయ్య పేర్కొన్నారు. మండలంలోని బాబాసాగర్ గ్రామంలో మాజీ ఎంపీపీ సయ్యద్ సాబిర్ హుస్సేన్ స్మారకార్థం నిర్వహిస్తున్న వాలీబాల్, కబడ్డీ పోటీలు గురువారంతో ముగిశాయి. వాలీబాల్ పోటీల్లో చింతలమానెపల్లి జట్టు (ప్రథమ) బాబాసాగర్ జట్టు (ద్వితీయ) స్థానంలో నిలిచింది. కబడ్డీ పోటీల్లో అందెవెల్లి జట్టు (ప్రథమ), షెడ్వాయి జట్టు (ద్వితీయ) స్థానంలో నిలిచింది. విజేతలకు ఎంపీపీ డుబ్బుల నానయ్య, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు నాజిం హుస్సేన్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. నాయకులు డుబ్బుల వెంకన్న, కత్తెర్ల మల్లేశ్, జాబరి భాస్కర్, అజీమ్ హుస్సేన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉద్యోగం పొందిన పూర్వవిద్యార్థినికి సన్మానం



పల్లవిని సన్మానిస్తున్న పాఠశాల కమిటీ సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాకేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో చదివి ఇటీవల నర్సింగ్ ఉద్యోగం సాధించిన పల్లవిని, ఆమె తల్లిదండ్రులు శ్రీనివాస్, సుప్రజను గురువారం పాఠశాల కమిటీ సభ్యులు సన్మానించారు. హెచ్‌ఎం కోటేశ్వర్‌రావు మాట్లాడుతూ పల్లవి 2014లో టెన్త్ పూర్తిచేసిందన్నారు. ఇటీవల ప్రభుత్వం నియమించిన నర్సింగ్ ఉద్యోగానికి ఎంపికైనట్లు తెలిపారు. పాఠశాల కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, మధుకర్, శ్రీనివాస్, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

కాగజ్‌నగర్‌రూరల్: విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని భారతీయ యువశక్తి ట్రస్ట్ ప్రతినిధి నిపుణుడు మల్లేశ్ అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎస్పీఎం, భారతీయ యువశక్తి ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ స్వయం ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డి.లక్ష్మీనరసింహం, అధ్యాపకులు రాజేశ్వర్, జనార్ధన్, దత్తాత్రేయ, ట్రస్ట్ ప్రతినిధి శంకర్ పాల్గొన్నారు.

బాలికల వసతి గృహానికి స్థల పరిశీలన

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో ఆదిమ గిరిజన బాలికల వసతి గృహం నిర్మాణం కోసం గురువారం అధికారులు స్థలాన్ని పరిశీలించారు. పీఎం జన్‌మన్ పథకం కింద రూ. 2.70 కోట్ల నిధులతో ఈ భవనం నిర్మించనున్నారు. జోడేఘాట్‌లోని సర్వే నంబర్ 4లో రెండెకరాల స్థలాన్ని గుర్తించారు. కెరమెరి తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎస్‌వోలు భరత్, శ్రీనివాస్, ఏటీడీవో పురుషోత్తం, ఏఈ శిధర్, ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్, సర్వేయర్ రమేశ్ తదితరులు ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

రెబ్బెన: మండలంలోని గోండుగూడ గ్రామంలో వృద్ధులకు గురువారం పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రేగులగూడ, కొలాంగూడ గిరిజన గ్రామాల్లో గురువారం ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. టీబీ, క్షయ వ్యాధులకు సంబంధించిన డాక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో పరీక్షలు చేశారు. ఎస్‌టీఎస్ ఎండీ ఖాదర్ పాషా పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

సీఎం సభ విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్‌రూరల్: ఆదిలాబాద్ జిల్లాలో ఇంద్రవెల్లిలో శుక్రవారం జరిగే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సభను విజయవంతం చేయాలని సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో ఇంద్రవెల్లిలో తొలి బహిరంగ సభకు హాజరవుతున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

లింగాపూర్: మండలంలోని గుంమ్నూర్ గ్రామంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత బృంద కళాకారులతో అవగాహన కల్పించారు. బ్యాంక్ ఖాతా, వివిధ పథకాల గురించి వివరించారు. లింగాపూర్ టీజీబీ బ్రాంచి మేనేజర్ ముఖేష్‌కుమార్, కళాజాత బృందం సభ్యుడు రమేశ్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

లింగాపూర్: మండల కేంద్రంలోని యూటీఎఫ్ క్యాలెండర్‌ను ఎంపీడీవో ప్రసాద్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు గురువారం ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి నారాయణ, మండల అధ్యక్షుడు జాదవ్ కైలాష్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, కోశాధికారి వడ్డె సాయినాథ్, సెక్రటరీ మోయినొద్దీన్, సరస్వతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేతనం పెంపుపై హర్షం

కెరమెరి: పెసా చట్టం మొబలైజర్ల వేతనాలను ప్రభుత్వం పెంచడంపై సంఘం మండల అధ్యక్షుడు మడావి భరత్ భూషణ్ హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఉన్న ప్రభుత్వం నెలకు రూ.2500 గౌరవ వేతనం ఇస్తుండగా..కాంగ్రెస్ ప్రభుత్వం రూ.1500 పెంచిందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి సీతక్క, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆడ ఆనంద్ రావు, కుర్సెంగ యాదవరావు, మెస్రం భాస్కర్ ఉన్నారు.

ఉచిత వైద్యశిబిరం

దహెగాం: మండలంలోని లగ్గాం గ్రామంలో సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో సిబ్బంది ప్రజల రక్తనమూనాలు సేకరించి కరీంనగర్‌లోని ల్యాబ్‌కు పంపారు. మండలంలో అన్ని గ్రామాల్లో వైద్యశిబిరం నిర్వహిస్తామని సిబ్బంది తెలిపారు. వైద్యబృందం సభ్యులు శివ, క్రిష్ణప్రసాద్, తిరుపతి, ప్రవీణ్, హాశ్విత, శృతి, అపర్ణ పాల్గొన్నారు.